క్లుప్తంగా

ఆలయానికి బంగారు కంఠాభరణం బహూకరణ



అర్వపల్లి ఆలయానికి కంఠాభరణాన్ని బహూకరిస్తున్న దాతలు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానందలక్ష్మీన ర్సింహస్వామి ఆలయానికి ఆదివారం దాతలు బంగారు కంఠాభరణాన్ని బహూకరించారు. జాజిరెడ్డిగూడేనికి చెందిన గుడిపల్లి మల్లారెడ్డి –యశోదమ్మల జ్ఞాపకార్థం హైదరాబాద్ తోపాటు వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారి కుమారులు గుడిపల్లి రవీందర్‌రెడ్డి, నర్సిరెడ్డి, కుశలవరెడ్డి, గిరేందర్‌రెడ్డి, అమృతారెడ్డి, కుమార్తెలు సునంద, వినతిలు తమ ఇలవేల్పు దైవమైన నర్సింహస్వామికి రూ. 2లక్షల విలువ చేసే 32 గ్రాముల కంఠాభరణాన్ని చేయించారు. జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్ యాదవ్ చేతుల మీదుగా దేవస్థానానికి బహూకరించారు. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ చిల్లంచర్ల విద్యాసాగర్, బైరబోయిన రామలింగయ్య, ముత్యాల బాలరాజు, అర్చకులు అర్వపల్లి రాంబాబుఅయ్యంగార్, ఆనంద్‌దీక్షితులు, పవన్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

ఏఐకేఎంఎస్ పోస్టర్ ఆవిష్కరణ

ఆత్మకూర్ (ఎస్) : ఈ నెల 25, 26 తేదీల్లో ఆలేరులో జరిగే ఏఐకేఎంఎస్ రాష్ట్ర 2వ మహాసభలను విజయవంతం చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు దాసరి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ముక్కుడుదేవులపల్లిలో ఏఐకేఎంఎస్ మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాలతో రైతులు తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి వెళ్తున్నారన్నారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బయ్యా రామచంద్రు, గుండాల మల్లయ్య, ఎస్‌కే జాని, నారపాక ముత్తయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సొడమ్మ జాతర ప్రారంభం



జాతరకు ముస్తాబైన ఆలయం

నూతనకల్ : మండల కేంద్రంలో సొడమ్మ జాతర సోమవారం ప్రారంభమవుతున్నట్లు యాదవ కుల పెద్దలు తెలిపారు. ఆదివారం జాతర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. యాదవుల ఆరాధ్యదైవం సొడమ్మ తల్లికి రెండు సంవత్సరాలకు ఒకసారి భక్తులు బోనాలు చెల్లించి మొక్కులు తీర్చుకుంటారని తెలిపారు. సొడమ్మ జాతర మూడు రోజుల పాటు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నూతనకల్, చిల్పకుంట్ల గ్రామాల యాదవ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపురంలో నేడు కంటి వైద్యశిబిరం ప్రారంభం

అర్వపల్లి : మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలో సోమవారం నుంచి కంటి వెలుగు శిబిరం మొదలవుతుందని కంటి వెలుగు వైద్యాధికారి డాక్టర్ చినపాక మణిరత్నం, సీహెచ్‌ఓ ఎల్. చరణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో నిర్వహించే శిబిరాన్ని తిమ్మాపురం గ్రామస్తులతో పాటు తిమ్మాపురం స్టేజీ, జ్యోతులనగర్ గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు ఎమ్మెల్యే రాక

తిరుమలగిరి : తిరుమలగిరి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి స్థానిక శాసన సభ్యుడు గాదరి కిశోర్‌కుమార్ హాజరవుతారని తహసీల్దార్ రమణారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

జీవాలకు వైద్యపరీక్షలు

సూర్యాపేట : పట్టణంలో కబేళా నందు పశువైద్యాధికారి పరీక్ష చేసిన తర్వాత మున్సిపల్ స్టాంపు గుర్తు ఉన్న గొర్రెలు, మేకలను మాత్రమే కొనుగోలు చేయాలని మున్సిపల్ కమిషనర్ పి.రామానుజులరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని మున్సిపల్ కబేళా నందు వెటర్నరి డాక్టర్ జానయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బండ జనార్దన్ రెడ్డిలు గొర్రెలు, మేకలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మున్సిపల్ కబేళా నందు వైద్య పరీక్షలు చేసిన మాంసాన్ని మాత్రమే అమ్మాలని మాంసం అమ్మకందారులను ఆదేశించారు. ఆదేశాలు ఉల్లంఘిస్తే సంబంధిత మటన్ షాపుని జప్తు చేయడంతో పాటు పెనాల్టీ విధించనున్నట్లు తెలిపారు.



గొర్రెలు, మేకలను పరిశీలిస్తున్న అధికారులు

రైతు వేదికల్లో కొరవడిన సౌకర్యాలు

- ప్రహరీలు లేకపోవడంతో రక్షణ కరువు
- నీటి వసతి కల్పించడంలో విఫలం
- పనిచేయని టాయిలెట్లు



రామన్నగూడెంలో ప్రహరీ లేని రైతువేదిక



పనిచేయని టాయిలెట్లు

అర్వపల్లి : రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇవ్వడానికి ఏర్పాటు చేసిన రైతు వేదికలు సమస్యలకు నిలయాలుగా మారాయి. వాటిని స్థలాల కొరత, ఇతర కారణాలతో ఊర్లకు దూరంగా నిర్మించారు. ఈ వేదికల్లో నిర్మించిన టాయిలెట్లు నిర్మాణ లోపంతో ఎక్కడా పనిచేయడం లేదు. కనీసం ప్రహరీలు లేకపోవడంతో వేదికలకు రక్షణ కొరవడింది. మూగజీవాలు వేదికల వద్ద పెంచుతున్న మొక్కలను తినేస్తున్నాయి. మద్యంప్రియులు రాత్రి వేళల్లో వేదికల ఆవరణల్లోనే మద్యం సేవించి సీసాలు, వ్యర్థ పదార్థాలు పడేసి పోతున్నారు.

మండలంలోని రెండు వేదికల్లోనూ సమస్యలే..

జాజిరెడ్డిగూడెం మండలంలో రామన్నగూడెం, తిమ్మాపురం రెండు గ్రామాల్లో రైతు వేదికలను క్లస్టర్ల వారీగా నిర్మించారు. తిమ్మాపురంలో ఊరి శివారులో, రామన్నగూడెంలో హైవే వెంట అర్వపల్లి–రామన్నగూడెం మధ్య నిర్మించారు. ఒక్కో రైతు వేదికను సుమారు రూ.22లక్షల వ్యయంతో నిర్మించారు. అయితే వీటి నిర్మాణంలో నాణ్యత లోపించింది. టాయిలెట్లు కూడా పనిచేయడం లేదు. తిమ్మాపురం రైతు వేదికలో నీటి సమస్య ఏర్పడింది. రైతు వేదికల నిర్వహణకు నెలనెలా నిధులు రాకపోవడంతో సరైన వసతులు కల్పించుకోలేని పరిస్థితి నెలకొంది.

సమస్యలు పరిష్కరించాలి



రైతుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన రైతు వేదికల్లో సమస్యలను పరిష్కరించాలి. టాయిలెట్లకు మరమ్మతు చేయించి వినియోగంలోకి తేవాలి. అలాగే వేదికల చుట్టూ ప్రహరీలు నిర్మించాలి. నిర్వహణ నిధులను ప్రభుత్వం నెలనెలా విడుదల చేయాలి.

– వజ్జె శ్రీనివాస్, రైతు సంఘం నాయకుడు

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



మండలంలోని రైతు వేదికల్లో టాయిలెట్లు సరిగా పనిచేయకపోవడంతో ఈ విషయాన్ని పీఆర్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రహరీల నిర్మాణం పైస్థాయిలో జరగాల్సి ఉంది. ఇతర సమస్యలను తమస్థాయిలో ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం.

– శశిధర్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



చెక్కులను అందజేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట : పేదల సంక్షేమమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ ధ్యేయమని మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేట క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ వ్యాప్తంగా 172 మంది లబ్ధిదారులకు రూ.73లక్షల 18 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. వేలాది మంది మధ్యతరగతి ప్రజలకు సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక చేయూత అందించడం జరుగుతుందని తెలిపారు. సీఎం రిలీఫ్ ఫండ్‌ను పార్టీలకు అతీతంగా అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, జెడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకట్ నారాయణ గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, వైస్ చైర్మన్ పుట్టా కిషోర్, వైవీ, నవరాల సత్యనారాయణ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



వెలుగుపల్లిలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న యాదవ సంఘం నాయకులు

తుంగతుర్తి : తుంగతుర్తి మండల పరిధిలోని వెలుగుపల్లి గ్రామంలో యాదవులకు రెండో విడత గొర్రెల పంపిణీ పట్ల హర్షం వ్యక్తం చేస్తూ యాదవ సంఘం నాయకులు ఆదివారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు యాదవ సంఘం నాయకులు మాట్లాడారు. యాదవుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. యాదవులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు గొర్రెల పంపిణీ పథకాన్ని చేపట్టిందన్నారు. కుల వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారిని ప్రోత్సహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు రాములు, లింగయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

హజ్ బిల్డింగ్ నిర్మాణానికి కృషి



సూర్యాపేటలో ఇఫ్తార్ విందులో పాల్గొని మాట్లాడుతున్న పటేల్ రమేష్‌రెడ్డి

భానుపురి : రానున్న ఎన్నికల్లో తనను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపిస్తే సూర్యాపేట జిల్లా కేంద్రంలో హజ్ బిల్డింగ్ నిర్మాణానికి కృషి చేస్తానని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి సూర్యాపేట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక పబ్లిక్‌క్లబ్ ఏర్పాటు చేసిన దావత్ –ఏ – ఇఫ్తార్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ముస్లింలు ప్రజలందరి శ్రేయస్సు కోసం కఠిన నియమ నిష్టలతో ఉపవాస దీక్షలు చేస్తారని తెలిపారు. ఈ దీక్షలు ఫలించి ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అన్ని కులాలు, మతాలకు సమాన హక్కులు కల్పించి దేశాన్ని ప్రపంచంలోనే అగ్రదేశంగా నిలిపిన చరిత్ర కాంగ్రెస్‌కు ఉందన్నారు. రానున్న రోజుల్లో ముస్లింలంతా పార్టీకి అండగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖబరస్తాన్ కమిటీ చైర్మన్ జహీరొద్దీన్, ఈద్గా కమిటీ చైర్మన్ కరీం సాబ్, హఫీజ్ ఖలీల్, జలీల్, బురాన్, బాసిత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు షఫీఉల్లా, ఫరూక్, గట్టు శ్రీనివాస్, గోదల రంగారెడ్డి, స్వామినాయుడు, సైదిరెడ్డి, గోపాల్‌రెడ్డి, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చి మద్దతు ధర పొందాలి



నాగారం : ఈటూరులో పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ



తిరుమలగిరి : తొండ గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ స్నేహలత



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నిర్వాహకులు

నాగారం : రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి ప్రభుత్వం అందించే మద్దతు ధర పొందాలని ఎంపీపీ కూరం మణివెంకన్న, తిరుమలగిరి పీఏసీఎస్ చైర్మన్ పాలేపు చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఈటూరు, ఫణిగిరి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. ప్రభుత్వం ఏ–గ్రేడ్ ధాన్యానికి రూ.2,060, బీ–గ్రేడ్ ధాన్యానికి రూ.2,040 చొప్పున మద్దతు ధర చెల్లిస్తుందని తెలిపారు. రైతులు 17శాతంలోపు తేమ ఉన్న ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకరావాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు పేరాల సరితయాదగిరి, గట్టు నర్సింహారావు, ఉపసర్పంచ్ ఎర్ర నరేష్, ఎంపీటీసీ జంపాల శోభరాజు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ యారాల ఇంద్రసేనారెడ్డి, సీఈఓ విజయకృష్ణారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ షాహిన్‌బేగం, ఆర్‌ఐ నర్సింహారావు, డైరెక్టర్లు కిష్టునాయక్, వజ్జ శంకర్, రావుల సత్తయ్య, నాయకులు గొడిశాల యాదగిరి, చిల్లర వెంకన్న, పేరాల రామచంద్రు, సత్తయ్య, అవిలయ్య, మల్లేష్, మహేష్, నాగార్జున, మహేష్, ఉపేంద్ర, రైతులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధర పొందాలి

తిరుమలగిరి : రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత కోరారు. ఆదివారం తొండ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నెమురుగొమ్ముల శాతవాహనరావు, ఏపీఎం సైదులు, రామాంజయ్య, చంద్రయ్య, మల్లయ్య, రామారావు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర పొందాలి

అర్వపల్లి : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు తమ పంటలను అమ్ముకొని మద్దతు ధర పొందాలని జాజిరెడ్డిగూడెంలోని ఉమామహేశ్వర రైతు ఉత్పత్తులు, మార్కెటింగ్ సేవల సొసైటీ గౌరవ అధ్యక్షుడు మాదగాని వెంకన్న, అధ్యక్షుడు బోయపల్లి వీరసోములు అన్నారు. ఆదివారం గ్రామంలో ఉమామహేశ్వర మాక్స్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి, శుభ్రం చేసి తెచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు నోముల నరేష్, కార్యదర్శి రింగు నగేష్, వడకాల బయ్యన్న, శిగ పిచ్చయ్య, దాసరి రవీందర్, బొడ్రబోయిన సైదులు, పోలెబోయిన యాదయ్య, నర్సింగ లింగయ్య, పి.రవి, ఉప్పలయ్య, వెంకన్న, సుదర్శన్, సమ్మయ్య, వీరయ్య, వెంకట్‌రెడ్డి, సోమయ్య, లింగయ్య, వెంకన్న, హరికృష్ణ, గుడిపల్లి సోమిరెడ్డి, పి.మధూకర్, కృష్ణమూర్తి, శ్రీను, దాసరి సోమయ్య, బాలయ్య, శిగ వెంకన్న, కమటం రాజు, నర్సింగ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



నాగారం : ఫణిగిరిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్

చలివేంద్రం ప్రారంభం



ఏపూరులో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న యూత్ సభ్యులు

ఆత్మకూర్ (ఎస్) : వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి యువజన సంఘాలు గ్రామగ్రామాన చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని స్నేహ యువజన సంఘం సభ్యుడు పోకబత్తిని నవీన్ కోరారు. ఆదివారం మండల పరిధిలోని ఏపూరులో స్నేహ యువజన సంఘం ఆధ్వర్యంలో, ముక్కుడుదేవులపల్లి స్టేజీ వద్ద ఆర్‌కే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రారంభించారు. సమాజ సేవలో యువకులు ముందుండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కల్లెపల్లి మధు, వీరయ్య, రాము, లక్ష్మణ్, కిరణ్, ఇందిర, ఇరుగు మధూకర్, కోడి రవికుమార్, బయ్య వెంకన్న, కప్పల క్రిష్ణయ్య, గుంషావలి, రాఘవరెడ్డి, కోడి పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్రం



మద్దిరాల : మాట్లాడుతున్న లక్ష్మయ్య



నూతనకల్ : తరలివెళ్తున్న నాయకులు

మద్దిరాల : కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని రైతు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు మూరగుండ్ల లక్ష్మయ్య అన్నారు. సీపీఐ ఇంటింటి ప్రచార కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న కళాజాతా ఆదివారం మండల కేంద్రానికి చేరుకుంది. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి కార్యకర్త కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతి ఇంటికి చేరవేయాలని కోరారు. నిత్యావసర సరుకులపై ధరలను విపరీతంగా పెంచి సామన్య ప్రజల నడ్డివిరుస్తున్నారని అన్నారు. వచ్చేనెల 14న కొత్తగూడెంలో జరిగే ముగింపు సభలో కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎల్లంల మురళి, ఏఐటీయూసీ జిల్లా ఆర్గనైజర్ జి.రాజారాం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయకార్యదర్శి ఎండీ ఇక్బాల్, శ్రీకాంత్, ఆకుల లింగయ్య, మీసాల శ్రీను, సుందరయ్య పాల్గొన్నారు.

వ్యతిరేకంగా ఉద్యమించాలి

నూతనకల్ : బీజేపీ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు, మేధావులు ఉద్యమించాలని సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు, మండల కార్యదర్శి తొట్ల ప్రభాకర్‌గౌడ్ కోరారు. ఆదివారం తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో ప్రారంభమయ్యే ఇంటింటికీ సీపీఐ కార్యక్రమానికి మండల కేంద్రం నుంచి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీజేపీ పాలనలో సామాన్యుల జీవన స్థితిగతులు దారుణంగా తయారయ్యాయని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి కార్పొరేట్ శక్తులకు పట్టం కడుతున్న మోదీని గద్దె దించడం కోసం ఇంటింటికీ సీపీఐ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు డీకొండ వీరన్న, మల్సూర్, రవి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



నాగారంలో మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నాగారం : మండల కేంద్రానికి చెందిన బొబ్బలి శివకుమార్ శనివారం ప్రమాదవశాత్తు ఇసుక జల్లెడలో ఇరుక్కొని మృతి చెందాడు. ఈ విషయాన్ని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వాట్సప్ ద్వారా తెలియజేశారు. దీంతో ఆయన వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి తన వ్యక్తిగత సహాయకుడు దూదిగాని సైదులుతో రూ.50,000ల ఆర్థికసాయం పంపించారు. కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మృతుడి పిల్లల చదువులకు అయ్యే ఖర్చును భరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పసుపులేటి వెంకట్‌రెడ్డి, జాజుల వీరయ్య, కడారి సోమయ్య, కన్నెబోయిన వెంకటభిక్షం, మంగదుడ్ల దశరథ, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ యారాల ఇంద్రాసేనారెడ్డి, ఆకుల ప్రతాప్, ఎలమకంటి సోమన్న, కొలిపాక సాయి, కరుణాకర్, రాజు, యాకస్వామి తదితరులు పాల్గొన్నారు.

మృతుడికి నివాళి..

నాగారం మండల కేంద్రానికి చెందిన బొబ్బలి శివకుమార్ శనివారం ప్రమాదవశాత్తు ఇసుక జల్లెడలో ఇరుక్కొని మృతి చెందాడు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య ఆదివారం మృతుడి భౌతిక కాయాన్ని సందర్శించి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5,000 ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడబోయిన యాదగిరి, చిల్లరబోయిన హన్మంతు, కడారి సుజాత, అనంతుల సోమేష్‌గౌడ్, మంగదుడ్ల రమేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బలగం సినిమా ప్రదర్శన

భానుపురి : పట్టణంలోని తాళ్లగడ్డ 29వ వార్డులో అనంతుల లక్ష్మమ్మ జ్ఞాపకార్థం స్థానిక కౌన్సిలర్ అనంతుల యాదగిరిగౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి బలగం సినిమాను ప్రదర్శించారు. ప్రత్యేకంగా ఎల్‌ఈడీ స్క్రీన్‌పై వేసిన సినిమాను వార్డు ప్రజలంతా కలిసి తిలకించారు. ఈ కార్యక్రమంలో అనంతుల నాగరాజు, కిరణ్, అశోక్, గోపగాని సందీప్, కన్నయ్య, కవిత తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న కొత్తపల్లి శివకుమార్

చివ్వెంల : ప్రభుత్వం ప్రజా సమస్యలు పరిష్కరించాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గుంజలూరు గ్రామంలో నిర్వహించిన ప్రజా పోరుయాత్రలో పాల్గొని మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా చేపట్టిన యాత్ర గుంజలూరు గ్రామానికి చేరుకున్నట్లు పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కార దిశగా యాత్ర కొనసాగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొత్తపల్లి రేణుక, అఖిల్, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

సమ్మేళనం విజయవంతంతో బీఆర్‌ఎస్‌లో జోష్

కోదాడ : బీఆర్‌ఎస్ ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం విజయవంతం కావడంతో ఆపార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ గడచిన 10రోజులుగా ఈ సమావేశ నిర్వాహణపై ప్రత్యేక దృష్టి సారించి చేసిన కృషి ఫలించిందని ఆ పార్టీ నాయకులు పలువురు పేర్కొంటున్నారు. మంటుటెండలో సైతం అనుకున్నంత మంది నాయకులు, కార్యకర్తలు సమావేశానికి రావడం పట్ల వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి వార్డుకు రెండు బస్సులను ఏర్పాటు చేయడంతో సమావేశానికి పురుషులకంటే మహిళలు ఎక్కువగా హాజరయ్యారు. సమ్మేళనంలో పట్టణానికి చెందిన పలువురు నాయకులతో మాట్లాడించారు. పలువురు మహిళలు బతుకమ్మలతో వేదిక వద్దకు వచ్చారు. ముస్లిం, మైనార్టీ యువకులు మంత్రిని, ఎమ్మెల్యేను కలిపి గజమాలతో సత్కరించారు.

కోదాడను అభివృద్ధి పథంలో నడిపించా : ఎమ్మెల్యే

కోదాడ నియోజకవర్గ ప్రజలు, నాయకులు అందించిన సహకారంతో నియోజకవర్గాన్ని గడిచిన నాలుగున్నర సంవత్సరాల్లో అభివృద్ధి పథంలో నడిపించానని, మున్ముందు ఇదే ఒరవడిని కొనసాగిస్తానని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పి.సత్యబాబు, అల్తాఫ్ హుస్సేన్, ఎస్‌కే నయీం, సుంకర అజయ్‌కుమార్, ఈదుల కృష్ణయ్య, బజ్జూరి వెంకటరెడ్డి, కల్లూరి పద్మజ, బెజవాడ శిరీష, పాదర్ యేసయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష



తిరుమలగిరి : అనంతారంలో విద్యార్థుల హాల్ టిక్కెట్లను పరిశీలిస్తున్న అధికారులు



నాగారం : పసునూర్ మోడల్‌స్కూల్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని అనంతారం మోడల్ స్కూల్‌లో ఆదివారం జరిగిన ప్రవేశ పరీక్షలు సజావుగా సాగినట్లు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ వేముల బాలరాజు తెలిపారు. మొత్తం 203 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకోగా 162 మంది పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. కార్యక్రమంలో డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ కె.అశోక్‌రెడ్డి, సోమసుందర్ పాల్గొన్నారు.

నాగారం : మండల పరిధిలోని పసునూర్ మోడల్ స్కూల్‌లో నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ కుంట రమేష్ మాట్లాడారు. 6వ తరగతిలో 102 మందికి గాను 77 మంది, ఇతర తరగతులకు 24 మందికి గాను 20 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరీక్ష డీఓలు రాంబాబు, రమేష్ పాల్గొన్నారు.

ఫ్లెక్సీ చించివేయడం హేయం

మునగాల : మండల కేంద్రంలో తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, కోదాడ నియోజకవర్గ బీఆర్‌ఎస్ మాజీ ఇన్‌చార్జ్ కన్మతరెడ్డి శశిధర్‌రెడ్డి యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని గుర్తుతెలియని వ్యక్తులు చించివేయడం హేయమైన చర్య అని శశిధర్‌రెడ్డి యువసేన నాయకుడు రాయిరవి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద చించివేసిన ఫ్లెక్సీని పరిశీలించి మాట్లాడారు. నియోజకవర్గంలో శశిధర్‌రెడ్డి చేస్తున్న సామాజిక కార్యక్రమాలను జీర్ణించుకోలేని కొంత మంది ఇటువంటి పనులకు పాల్పడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇలాంటి చిల్లర రాజకీయాలు మానుకోవాలని, లేకుంటే రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెబుతామని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట శశిధర్‌రెడ్డి యువసేన నాయకులు దొంతగాని లింగయ్య, కోట వెంకటేశ్వర్లు, జిల్లేపల్లి వంశీ, వినయ్ పాల్గొన్నారు.

పెన్షన్ మార్చ్‌కు తరలిన సీపీఎస్ ఉద్యోగులు



పెన్షన్ మార్చ్‌కు వెళ్తున్న ఉద్యోగులు

కోదాడఅర్బన్ : సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం సూర్యాపేటలో నిర్వహించిన పెన్షన్ మార్చ్‌కు కోదాడ డివిజన్ నుంచి సీపీఎస్ ఉద్యోగులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి వాహనాల ర్యాలీని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బడుగుల సైదులు జెండా ఊపి ప్రారంభించారు. అంతకు ముందు ఆయన మాట్లాడారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం కొనసాగించాలని, ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చే పెన్షన్ భిక్షకాదని, ఉద్యోగుల హక్కు అని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈయూ నాయకులు సిరంగి ఏడుకొండలు, పి.అంకులయ్య, కె.కరుణాకర్, యల్లయ్య, ఖాసీం, శ్రీనివాస్, మదన్ మోహన్, వెంకన్నగౌడ్, ఆంజనేయులు, శ్రీను, అంజయ్య, సురేష్, వెంకటేశ్వర్లు, జ్యోతి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



శ్రీనివాసరెడ్డిని పరామర్శిస్తున్న పద్మావతి

మునగాల : తిమ్మారెడ్డిగూడెంలో ఈ నెల 14న మండల ఎస్‌ఐ చేయిచేసుకోవడంతో గాయపడిన కొక్కిరేణి ఎంపీటీసీ ఎర్రం శ్రీనివాసరెడ్డిని ఆదివారం ఆయన నివాసంలో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే ఎన్.పద్మావతి పరామర్శించారు. అనంతరం ఆమె మాట్లాడారు. ఇటీవల నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకుల అండదండలతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై పోలీసుల దౌర్జన్యాలు ఎక్కువయ్యాయన్నారు. కాంగ్రెస్ ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డిపై ఎస్‌ఐ అకారణంగా చేయిచేసుకోవడం పట్ల ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు ఎస్‌ఐపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరగా పూర్తిస్థాయిలో విచారణ చేసి త్వరలో చర్యలు చేపట్టనున్నట్లు హామీ ఇచ్చినట్లు ఆమె తెలిపారు. ఎంపీటీసీపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయడం పట్ల తీవ్రంగా ఖండించారు. ఆమె వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొప్పుల జైపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మండవ చంద్రయ్య, నాయకులు దేవినేని రవి, కాలె సామియేలు, స్థానిక సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, నాయకులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

మునగాల : మండలంలోని కృష్ణానగర్‌లో ఆదివారం విద్యుదాఘాతానికి గురై ఓ పాడిగేదె మృతిచెందింది. గ్రామానికి చెందిన కేతావత్ వెంకటేశ్వర్లు అనే రైతు తన గేదెలను మేపేందుకు పొలాల వద్దకు వెళ్లాడు. కాగా విద్యుత్ మోటార్‌కు వచ్చే వైరు గేదె కాళ్లకు చుట్టుకొని విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు బాధిత రైతు తెలిపారు.